సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

# మన చౌరాస్తా

The Complete News way

మన చౌరాస్తా Telugu News Channel

సంపుటి : 02 | సంచిక : 20 | ఎడిటర్ : ఉప్పలంచి నరేందర్ | శుక్రవారం | 25.04.2025



‘సన్న బియ్యం’ పంపిణీ

## విప్లవాత్మక పథకం

### స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం

జఫర్‌గడ్, మన చౌరాస్తా : దేశంలో ఎక్కడా లేని విధంగా రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి సన్న బియ్యం పంపిణీ పథకాన్ని అమలు చేయడం విప్లవాత్మకమని స్టేషన్‌ఘన్‌పూర్ శాసన సభ్యులు కడియం శ్రీహరి అన్నారు. గురువారం జిల్లాలోని జాఫర్గడ్ మండలంలోని రేగడి తండాలో సన్న బియ్యం లబ్ధిదారుడైన భూక్య కిషన్ నాయక్ ఇంట్లో సన్న బియ్యంతో వండిన భోజనాన్ని ఎమ్మెల్యే కడియంతో పాటు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, మార్కెట్ చైర్‌పర్సన్ లావణ్య రెడ్డి వారి కుటుంబ సభ్యులతో కలిసి సహపంక్తి భోజనం చేశారు. సందర్భంగా కడియం మాట్లాడుతూ.. సన్న బియ్యం పంపిణీతో 80 శాతానికి పైగా బడుగు బలహీన వర్గాల ప్రజలు ప్రయోజనం పొందుతున్నారని పేర్కొన్నారు. ప్రభుత్వం అమలు చేస్తున్న సన్న బియ్యం పంపిణీ పథకం పేదవాడి ఆత్మగౌరవ పథకమని తెలిపారు. దేశ చరిత్రలోనే సన్న బియ్యం పంపిణీ చారిత్రాత్మకమని కొనియాడారు. ప్రజలంతా ఈ పథకాన్ని వినియోగించుకోవాలని సూచించారు. రైతులు ఈ సన్న రకం వరి ధాన్యం సాగుపై ఎక్కువగా దృష్టి సారించాలని తెలిపారు. కలెక్టర్ మాట్లాడుతూ.. అర్హత గల ప్రతి పేదవాడికి నాణ్యత గల ఆహారాన్ని అందించాలనే ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా సన్న బియ్యం పంపిణీ చేసినట్లు తెలిపారు. అంతకుముందు సంప్రదాయ దుస్తుల్లో తండా వాసులు వారికి ఆత్మీయంగా స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఆర్డీఓ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు పాల్గొన్నారు.

## చరిత్ర తెలుసుకోవాలి

- ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



3 లో

చరిత్ర తెలిసినోళ్లే భవిష్యత్తును నిర్మించగలరు అది తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ కే సాధ్యమైందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. గురువారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి రజతోత్సవ వేడుకల కోసం ఏర్పాటు చేస్తున్న సభ స్థలాన్ని పరిశీలించారు. 25వ వసంతం నిండుకున్న బీఆర్ఎస్ పార్టీ యొక్క రజతోత్సవ వేడుకలకు లక్షలాదిగా తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు.

wanted

విలేకరులు కావలెను

మన చౌరాస్తా తెలుగు దినపత్రిక స్థాపించిన అనతి కాలంలోనే పాఠకుల విశేష ఆదరణ పొందుతూ డిజిటల్ మీడియా రంగంలో దూసుకెళ్తోంది. స్థానిక సమస్యలపై, రాజకీయ, ఎడ్యుకేషన్, ఆరోగ్యం, సినిమా వార్తలు అందిస్తూ అందరి మన్ననలు పొందుతూ ముందుకు సాగుతోంది. మా పత్రికలో పనిచేయుటకు అనుభవం, ఆసక్తి గల జిల్లా స్టాఫ్ రిపోర్టర్లు, మండల రిపోర్టర్లు కావలెను.. పూర్తి వివరాలకు ఈ కింది నంబర్లలో సప్రదించగలరు.

manachourasta@gmail.com

8555800812 | 9676400812

సామాన్యుడి గొంతుగా.. సామాజిక సమర వేదికగా..

మన చౌరాస్తా

The Complete News way

2 లో

రైతు శ్రేయస్సు కోసమే

## భూ భారతి చట్టం

General News



# టీజీఆర్ఎస్ జేసీ విద్యార్థులకు అభినందన

**జనగామ, మన చౌరాస్తా :** టీజీఆర్ఎస్ జేసీ కొడకండ్ల గురుకుల విద్యార్థినులను జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్, అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ అభినందించారు. ఇంటర్మీడియట్ పరీక్ష ఫలితాల్లో రాష్ట్ర, జిల్లా స్థాయిలో అత్యుత్తమ ర్యాంకులు సాధించిన కొడకండ్ల టీజీఆర్ఎస్ జేసీ విద్యార్థినులను గురువారం జిల్లా సమీకృత కలెక్టర్ కార్యాలయంలో కలిసి అభినందించారు. ఈ సందర్భంగా విద్యార్థినులతో ముచ్చటించారు. భవిష్యత్తులో వారు ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. ఇంతటి విజయానికి తోడ్పాటునందించిన కళాశాల ప్రిన్సిపాల్ తమ్మి దిలీప్ కుమార్, అధ్యాపక బృందానికి, విద్యార్థుల తల్లిదండ్రులకు కలెక్టర్ అభినందనలు తెలియజేశారు. అదే విధంగా ఈ ఫలితాలు ప్రభుత్వ విద్యా వ్యవస్థపై ప్రజల్లో మరింత నమ్మకం కలిగిస్తాయని కలెక్టర్ పేర్కొన్నారు. అనంతరం విద్యార్థినులను, కళాశాల



ఉపాధ్యాయులను అదనపు కలెక్టర్ అభినందించి, ప్రవేశ పరీక్షల్లో విద్యార్థినులకు కావాల్సిన సహాయాన్ని అందిస్తామని హామీ ఇచ్చారు. కార్యక్రమంలో డీఐఈఓ జితేందర్ రెడ్డి పాల్గొన్నారు.

# రైతు శ్రేయస్సు కోసమే భూ భారతి

**జాఫర్‌గడ్, మన చౌరాస్తా :** రైతు శ్రేయస్సు కోసమే కాంగ్రెస్ సర్కారు భూ భారతి చట్టాన్ని తీసుకొచ్చిందని స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి అన్నారు. గురువారం జనగామ జిల్లాలోని జాఫర్‌గడ్ మండల కేంద్రంలోని రైతు వేదికలో రాష్ట్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా ప్రవేశపెట్టిన భూ భారతి ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ సదస్సుకు కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్, ఘనపూర్ (స్టేషన్) మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ లావణ్య రెడ్డితో కలిసి ముఖ్య అతిథిగా కడియం హాజరయ్యారు. ఈ నేపథ్యంలో భూ భారతి చట్టంలోని సెక్షన్లు, వాటి వివరాలను రైతులకు పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అధికారులు రైతులకు అవగాహన కల్పించారు. ఈ మేరకు ప్రజలు అడిగిన పలు సమస్యలను కలెక్టర్ నివృత్తి చేశారు. అనంతరం కడియం మాట్లాడుతూ.. భూ భారతి చట్టంతో రైతుల భూములకు భద్రత లభిస్తుందన్నారు. రైతులు, ప్రజలు పడుతున్న ఇబ్బందులను గమనించిన రాష్ట్ర ప్రభుత్వం భూ సమస్యల శాశ్వత పరిష్కారానికి నిపుణుల కమిటీతో వివిధ రాష్ట్రాల్లో అధ్యయనం చేసి, పటిష్టమైన చట్టాన్ని రూపొందించి, అమల్లోకి తెచ్చిందని తెలిపారు. ధరణి పోర్టల్ ద్వారా ప్రజలు అనేక సమస్యలను ఎదుర్కొన్నారని, ఇప్పుడు ఈ భూ భారతి చట్టం ద్వారా అన్ని సమస్యలు సులభంగా పరిష్కరించడానికి అవకాశం ఉందన్నారు. భూ సమస్యలపై రైతులు మీసేవాలో దరఖాస్తు చేసుకోవచ్చని వెల్లడించారు. అదే విధంగా రిజిస్ట్రేషన్, మ్యుటేషన్ చేసే ముందు భూముల వివరాలు

## ప్రతి రైతుకు ఈ చట్టంపై అవగాహన కలిగి ఉండాలి

## స్టేషన్‌ఘన్‌పూర్ ఎమ్మెల్యే కడియం శ్రీహరి



పూర్తిస్థాయిలో సర్వే చేసి, మ్యాప్ తయారు చేయడం జరుగుతుందని, సాదాబైనామా దరఖాస్తులు కూడా పరిష్కారమవుతాయని తెలిపారు. భూదార్ కార్డుల జారీ, ఇంటి స్థలాలు, ఆబాది, రైతులకు ఉచిత న్యాయ సహాయం అందించడం జరుగుతుందని పేర్కొన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ.. ధరణిలో అప్పీల్ చేయడానికి అవకాశం లేదని, సివిల్ కోర్టుకు వెళ్లాలని, ఈ భూ భారతి చట్టంలో తహసీల్దార్ నుంచి ఆర్డీఓ, ఆర్డీఓ నుంచి కలెక్టర్, కలెక్టర్ నుంచి ల్యాండ్ ట్రిబ్యునల్‌కు దరఖాస్తు చేసుకునే అవకాశం కల్పించారన్నారు. ఈ చట్టం ద్వారా రికార్డుల్లో తప్పుల సవరణకు అవకాశం కల్పించడం జరిగిందని పేర్కొన్నారు. ఈ నెల 29వ తేదీ వరకు జిల్లావ్యాప్తంగా భూ భారతి అవగాహన సదస్సులను పూర్తి చేసుకుంటామని, మే 1వ తేదీన జిల్లాలోని ఒక మండలంలో పైలట్ ప్రాజెక్టు కింద ప్రారంభించుకుంటామని, జూన్ మొదటి వారంలో ఈ భూ భారతి చట్టం జిల్లా మొత్తం అమల్లోకి వస్తుందని తెలిపారు. ప్రభుత్వ ఆదేశానుసారం త్వరలో గ్రామ సభలు నిర్వహించి, రైతుల నుంచి తమ సమస్యల వివరాలను సేకరించడం జరుగుతుందని వెల్లడించారు. సదస్సులో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ హనుమాన్ నాయక్, ఆర్డీఓ వెంకన్న, తహసీల్దార్ వెంకటేశ్వర్లు, ఇతర సంబంధిత అధికారులు, రైతు సంఘాల నాయకులు, సభ్యులు, అధిక సంఖ్యలో రైతులు, తదితరులు పాల్గొన్నారు.



# ‘భూ భారతి’పై అవగాహన

**బచ్చన్నపేట, మన చౌరస్తా :** మండలంలోని రైతు వేదికలో భూ భారతి ఆర్ఓఆర్ చట్టంపై అవగాహన సదస్సును నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా హాజరై మాట్లాడుతూ భూ భారతి చట్టం ద్వారా రైతుల భూ సమస్యల పరిష్కారానికి చక్కటి అవకాశం ఉన్న దృష్ట్యా రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రత్యేకంగా అన్ని మండలాలలో అవగాహన సదస్సులు ఏర్పాటు చేశామని తెలిపారు. భూ భారతి ద్వారా రైతుల భూములను సర్వే చేయించి, హద్దులు నిర్ణయించి, మ్యాప్ తో సహా రిజిస్ట్రేషన్ సమయంలో ఇవ్వడం జరుగుతుందన్నారు. భూ భారతి చట్టం ద్వారా రైతులకు చేకూరే ప్రయోజనాల గురించి కలెక్టర్ ఒక్కో అంశం వారీగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా అవగాహన కల్పించారు. అనంతరం స్థానిక మండల కేంద్ర పరిధిలో ఏర్పాటు చేసిన ఐకేపీ ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ సందర్శించి, నిర్వాహకులకు పలు సూచనలు చేశారు. కార్యక్రమంలో స్పెషల్ డిప్యూటీ కలెక్టర్ సుహాసిని, ఆర్డీఓ గోపీరాం, డీఏఓ రామారావు నాయక్, తహసీల్దార్ ప్రకాష్ రావు తదితరులు పాల్గొన్నారు.



# దుకాణాలకు లైసెన్స్ తప్పనిసరి

## అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్

**జనగామ, మన చౌరాస్తా :** జనగామ మున్సిపాలిటీ పరిధిలోని పలు దుకాణాలను జిల్లా అదనపు కలెక్టర్ పింకేష్ కుమార్ గురువారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా కొత్తగా నిర్మించిన మహేంద్ర షో రూం ను పర్యవేక్షించి, సంబంధిత వివరాలను అధికారులను అడిగి తెలుసుకున్నారు. అలాగే షో రూం కొలతలు తీయించి, సిబ్బందికి సూచనలు చేశారు. దుకాణాల యజమానులు వాణిజ్య లైసెన్స్ తప్పనిసరిగా కలిగి ఉండాలని సూచించారు. అదే విధంగా పాత వాణిజ్య లైసెన్స్ లను కూడా పునరుద్ధరించుకోవాలని తెలిపారు. పురపాలక పరిధిలో నివాసానికి అనుకూలంగా లేని, శిథిలావస్థలో గల ఇళ్లకు పన్ను వస్తున్నటువంటి ఇళ్లను గుర్తించి, క్షేత్ర స్థాయిలో పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ తనిఖీలో అదనపు కలెక్టర్ వెంట మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వర్లు, సంబంధిత అధికారులు ఉన్నారు.



General News



# మన చరిత్ర తెలుసుకోవాలి

## బీఆర్ఎస్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత



**ఎల్కతుర్తి, మన చౌరాస్తా :** చరిత్ర తెలిసినోళ్లే భవిష్యత్తును నిర్మించగలరు అది తెలంగాణ రాష్ట్ర సాధనలో కేసీఆర్ కే సాధ్యమైందని ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత అన్నారు. గురువారం బీఆర్ఎస్ నాయకులతో కలిసి రజతోత్సవ వేడుకల కోసం ఏర్పాటు చేస్తున్న సభ స్థలాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 25వ వసంతం నిండుకున్న బీఆర్ఎస్ పార్టీ యొక్క రజతోత్సవ వేడుకలకు పెద్ద ఎత్తున లక్షలాదిగా తెలంగాణ వ్యాప్తంగా ఉన్న కేసీఆర్ అభిమానులు, తెలంగాణ మేధావులు, తెలంగాణను ప్రేమించేటువంటి బిడ్డలు అందరూ కలుపుకొని 25 వసంతాల మన తెలంగాణ పోరాట చరిత్రను ఉద్యమ చరిత్రను సంబురంగా జరుపుకోవాలన్నారు. ఈ నెల 27న ఎల్కతుర్తి దగ్గర వరంగల్ కు కూత వేటు దూరంలో పెద్ద ఎత్తున లక్షలాది మందితో సమావేశం ఏర్పాటు చేయడం జరుగుతుందని అన్నారు. వరంగల్ గడ్డ అంటే ఎంతో పవిత్రమైన భూమి ఉద్యమ సమయంలో జాతీయ నాయకులు తెలంగాణ ఉద్యమానికి మద్దతు ఇచ్చిన సందర్భం ఉందన్నారు. వరంగల్ ఒక మైలురాయిగా ఉందని ఇప్పుడు ఎల్కతుర్తి మరో చరిత్ర మైలురాయిగా ఉండబోతుందని అన్నారు. తెలంగాణ ప్రజలకు శ్రీరామరక్షగా నిలబడేది పార్టీ బీఆర్ఎస్ అన్నారు. ఈ సందర్భంగా రిటైర్డ్ ఐపీఎస్ ఆఫీసర్ ఆర్ఎస్ ప్రవీణ్ కుమార్ మాట్లాడుతూ పుట్టెడు దుఃఖంలో ఉన్న తెలంగాణను ఓదార్చడం కోసం తెలంగాణ ఆవిర్భావం కోసం వందలాదిగా ప్రాణత్యాగాలు చేసిన యువకులకు నివాళులర్పించడం కోసం భావితరాలకు దిశా నిర్దేశం చేయడం కోసం కేసీఆర్ ఈ సభకు రాబోతున్నారని అన్నారు. లక్షలాదిగా తరలి వచ్చి సభను సక్సెస్ చేయాలన్నారు. కార్యక్రమంలో టీఆర్ఎస్ మాజీ ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కార్పోరేటర్లు జడ్పిటిసిలు, కార్పొరేషన్ చైర్మన్లు, మండల నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



# ఏర్పాట్లను పరిశీలించిన ఎమ్మెల్యే పల్లా

ఎల్కతుర్తి, మన చౌరాస్తా : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో గులాబీ పార్టీ రజతోత్సవ సంబురాల ఏర్పాట్లను గురువారం ఎమ్మెల్యే డా. పల్లా రాజేశ్వర్ రెడ్డితో కలిసి మాజీ మంత్రి వర్యులు జగదీశ్ రెడ్డి పరిశీలించారు. అనంతరం వారు మాట్లాడుతూ కేసీఆర్ సందేశం వినేందుకు ఇప్పటికే అన్ని గ్రామాల నుంచి సభకు తరలివచ్చేందుకు శ్రేణులు, ప్రజలు సిద్ధమయ్యారన్నారు.




# పిల్లల చేతులు శుభ్రంగా ఉంచుకోవాలి

**బచ్చన్నపేట, మన చౌరస్తా :** మండలంలోని ఇందిరానగర్ అంగన్‌వాడీ కేంద్రాలకు హాజరయ్యే పిల్లల సంఖ్యకు అనుగుణంగా హ్యాండ్ వాషింగ్, మౌలిక సదుపాయాలు కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా డిపిఓ సరూప పాల్గొన్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ తప్పనిసరిగా చేతులను శుభ్రంగా కడుక్కోవాలని సూచించారు. పాఠశాల మరుగుదొడ్లను క్రమం తప్పకుండా శుభ్రం చేయాలని, సబ్బు, కాగితపు తువ్వాళ్లు అందుబాటులో ఉంచాలన్నారు. గ్రామపంచాయతీ దినోత్సవం సందర్భంగా గ్రామపంచాయతీ సిబ్బందిని సన్మానించారు. కార్యక్రమంలో ఎంపీడీవో మల్లికార్జునరావు, ఎస్ బి ఎం కరుణాకర్, బచ్చన్నపేట సెక్రెటరీ చారి, అంగన్వాడి టీచర్, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

# ఉగ్ర దాడులను ప్రతి ఒక్కరూ ఖడించాలి

**చేర్యాల, మన చౌరాస్తా :** కాశ్మీర్ లోని పహల్గాం ఉగ్ర దాడిలో మృతి చెందిన వారి ఆత్మలు శాంతించాలని కోరుతూ చేర్యాల నగర సంకీర్తన భక్త సమాజం ఆధ్వర్యంలో గురువారం స్థానిక శంకర సదనం వద్ద శ్రద్ధాంజలి ఘటించారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ భారత దేశం శాంతి దేశమని అలా అని ఇలాంటి చర్యలకు పాల్పడితే ప్రతీకార చర్యలు చాలా పెద్ద ఎత్తున ఉంటాయని హెచ్చరించారు. ఈ ఘటనను యావత్ ప్రపంచం ఖండిస్తుందని అన్నారు. ఇలాంటి ఘటనలు జరిగినప్పుడు భారతదేశ పౌరులు ఏకతాటిపై నిలిచి ముందుకు సాగాలని అన్నారు. ఈ కార్యక్రమంలో నగర సంకీర్తన భక్త సమాజ సభ్యులు పాల్గొన్నారు.



# కేసీఆర్‌ను కలిసిన బబ్బూరి

జనగామ, మన చౌరాస్తా : తెలంగాణ రాష్ట్ర మాజీ ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర రావును జనగామ జిల్లా బీఆర్ఎస్ నాయకుడు బబ్బూరి శ్రీకాంత్ గౌడ్ మర్యాదపూర్వకంగా ఎర్రవెల్లి నివాసంలో కలిశారు. ఈ సందర్భంగా పార్టీ రజతోత్సవ కార్యక్రమాల నిర్వహణ, వరంగల్ బహిరంగ సభ తదితర అంశాలపై ఆయన దిశా నిర్దేశం చేశారు. అలాగే పార్టీ క్షేత్ర స్థాయిలో బలోపేతానికి కృషి చేయాలని సూచించినట్లు వారు తెలిపారు.

Local News



## ధాన్యం కొనుగోలు కేంద్రం పరిశీలన



**జఫర్‌గడ్, మన చౌరాస్తా :** జిల్లాలోని స్టేషన్‌ఘన్‌పూర్ నియోజకవర్గంలోని తిమ్మంపేట గ్రామ పరిధిలో ఐకేపీ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా కొనుగోలు కేంద్రంలో రైతులు ఆరబోసిన ధాన్యం తేమ శాతాన్ని పర్యవేక్షించి, కొనుగోళ్ల రిజిస్టర్లను సక్రమంగా నిర్వహించాలని, రైతుల పూర్తి వివరాలను రికార్డుల్లో స్పష్టంగా నమోదు చేయాలని ఆదేశించారు. కొనుగోళ్లు పూర్తైన వెంటనే సంబంధిత మిల్లులకు తరలించాలని, ఎప్పటికప్పుడు ఓపీఎంఎస్ లో కొనుగోళ్ల వివరాలను నమోదు చేయాలని, తద్వారా సకాలంలో రైతుల ఖాతాల్లోకి నగదు జమ అవుతుందని సూచించారు. కలెక్టర్ వెంట ఆర్డీఓ వెంకన్న, డీవీహెచ్ఓ రాధా కిషన్, డీటీ సీఎస్ శ్రీనివాస్, సంబంధిత అధికారులు ఉన్నారు.



## యూనిఫామ్‌లను పరిశీలించిన డీఈవో

**చేర్యాల, మన చౌరాస్తా :** మండలంలోని వీరన్నపేట గ్రామంలో విద్యార్థుల కోసం కుట్టుతున్న స్కూల్ యూనిఫామ్ లను సిద్దిపేట జిల్లా విద్యాధికారి శ్రీనివాస్ రెడ్డి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నాణ్యతతో బట్టలు కుట్టాలని సూచించారు. ఆయన వెంట మండల విద్యాధికారి రచ్చ కిష్టయ్య, పెంటపర్తి కొండల్ రెడ్డి ఉన్నారు.

## నేడు భూ భారతిపై అవగాహన సదస్సు

**చేర్యాల, మన చౌరాస్తా :** భూభారతి, నూతన ఆర్ఓఆర్ చట్టంపై నేడు అవగాహన సదస్సును నిర్వహించనున్నట్టు చేర్యాల తహసీల్దార్ ఒక ప్రకటనలో తెలిపారు. శుక్రవారం రోజున సాయంత్రం 3.00 గంటలకు చేర్యాల పట్టణ రైతు వేదికలో జరిగి ఈ సదస్సుకు కలెక్టర్‌తో పాటు జిల్లా అధికారులు, రెవెన్యూ డివిజన్ అధికారి హాజరు కానున్నారని తెలిపారు.

## బాధిత కుటుంబాన్ని పరామర్శించిన పొన్నం యువసేన నాయకులు

ఎల్కతుర్తి, మన చౌరాస్తా : మండలంలోని గోపాల్ పూర్ గ్రామంలో బుధవారం రోజున ప్రకృతి గాలి విపత్తుతో గోపాల్ పూర్ గ్రామానికి చెందిన శీలం రాజయ్య లక్ష్మి ఇల్లు రేకులు కూలిపోవడంతో రోడ్డున పడే పరిస్థితి నెలకొంది. ఈ నేపథ్యంలో కాంగ్రెస్ పార్టీ నాయకులు, పొన్నం యువసేన వ్యవస్థాపకులు తంగళ్ళపల్లి రమేష్‌కి సమాచారాన్ని తెలియజేయడంతో గురువారం రోజు గోపాల్ పూర్ గ్రామానికి చేరుకొని ఇల్లు కూలిపోయిన బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా తంగళ్ళపల్లి రమేష్ మాట్లాడుతూ ప్రకృతి వైపరీతంతో నష్టపోయిన కుటుంబాలకు ఆర్థిక సహాయం అందజేయడం జరిగిందన్నారు. కార్యక్రమంలో ఎల్కతుర్తి మండల కిసాన్ సెల్ అధ్యక్షులు పెండ్యాల తిరుపతి, స్థానిక నాయకులు సందీప్, మనోజ్, సురేష్, రాకేష్, రాము, మణికిరణ్, ప్రణీత్ తదితరులు పాల్గొన్నారు.

